# నాబాల్యం ఏమైంది?

తన తండ్రి చనిపోయిన సంగతి తెలిసి అలా చూస్తూ వుండిపోయాడు చంద్రం. 'ఏమైందోయ్?' అంటూ అతని క్లాస్‌మేట్ ప్రకాష్ టెలిగ్రాం లాక్కుని చదివాడు. 'సారీ బ్రదర్: మై హార్టీ కండొలెన్సెస్' అని వాచీ చూసి "పద, మరో గంటలో ట్రయినుంది. డోన్ట్ వరీ. మెస్‌లో నేను చెప్తాలే. నీ రూం కూడా-ఏమీ వర్రీ అవకు. గాడ్ ఈజ్ దేర్. ప్రయాణానికి డబ్బులున్నాయా"-అంటూ అతను సాయం చేస్తుంటే-

చంద్రానికి ఏమీ అర్థం కావడంలేదు. చావుగురించి ఎలాగూ తెలీదు. కాని తనతండ్రి గురించే ఏమీ గుర్తురావడం లేదని ఆశ్చర్యంగా వుంది. అర్థంకాకుండా వుంది. మెడికల్ కాలేజీలో జేరి హాస్టల్ జీవితం మొదలు పెట్టేవరకూ పదిహేడేళ్ళూ అతను తల్లిదండ్రుల వద్దనే పెరిగాడు: అయినా, ఆ పదిహేడేళ్ళలో ఒక్కరోజు కూడా అతనికి గుర్తురావడంలేదు. అమ్మానాన్నలకి దూరమయ్యానని తనతోటి విద్యార్థులు కొందరు హాస్టల్ లో తీరిగ్గా కూర్చుని బెంగెట్టుకుంటుంటే అతనికి అర్థం అయ్యేదికాదు. గత రెండేళ్ళ పొరుగూరి జీవితంలోనూ అతనికి చాలా కొద్దిసార్లు ఇల్లూ, కుటుంబమూ గుర్తొచ్చాయి. ఇప్పుడు తన తండ్రి హఠాత్తుగా చనిపోయాడని తెలిసినా అలాగే వుంది.

చంద్రం తండ్రి వీరభద్రం. ఓ మధ్య తరగతి కాంట్రాక్టరు. ఈమధ్యే పెద్ద ఇల్లు కూడా కట్టాడు. రైలు ప్రయాణం తర్వాత రిక్షాలో వెళ్ళి ఇంట్లో అడుగెట్టిన చంద్రానికి కొందరు బంధువులు ఎదురొచ్చారు. ఏవేవో మాట్లాడుతూ అతని మేనమామ బావురుమన్నాడు. చంద్రానికి ఏడుపురాలేదు. మౌనంగా తల్లి వున్న గదిలోకి వెళ్ళాడు. సుశీల తన పెద్ద కొడుకుని చూసి వెక్కి వెక్కి ఏడవసాగింది. చంద్రం చూస్తూ నిలబడ్డాడు. అతను ఏడవడం లేదని గమనించి తన ఏడుపు ఆపి సుశీల "దా, నాయనా ఇలా కూచో" అని కొడుకు తల నిమురుతూ అన్నగారితో "బెంబేలెత్తిపోయాడు అన్నయ్యా, ఏడుపుకూడా రావడంలేదు, ఆయనల్లా నట్టేట్లో వదిలేసి వెళ్ళిపోయారు. వీడు ఏమవుతాడో బెంగెట్టుకుని" అంది. రామం కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ మేనల్లుణ్ణి ఓదార్చాడు. వేదాంతం చెప్పాడు. పరలోకాన్నించి కూడా పెద్దలు మనని కాపాడతారన్నాడు. కర్మ అన్నాడు.

చంద్రానికి ఏడుపురాలేదు. భోంచేసి నిద్రపోయాడు.

* * *

సాయంత్రం పరధ్యానంగా తిరుగుతూ మూడో అంతస్తులో ఓగదిలో తన అయిదేళ్ళ చెల్లెలికి సినీమా కథలు చెప్తున్న తమ్ముడు రవిని చూశాడు చంద్రం. పదోక్లాస్ స్టూడెంట్ రవి. చంద్రాన్ని చూసి "ఈ పెద్ద వాళ్ళకి చాదస్తం అన్నయ్యాః నాన్న చచ్చిపోయాడని నువ్వు ఏడవలేదుట. దాన్ని గురించి పెద్ద గొడవ, సెంటిమెంటల్ ఇడియట్స్!"

"అప్పుడు నువ్వు దగ్గరున్నావుగా. నువ్వు ఏడిచావా?"

"ఏడుపు రాలేదు. మనవి రాతి గుండెలా అన్నయ్యా?"

"ఛఛః అదేం కాదు. ప్రతీదానికీ కారణం వుంటుంది. కారణం లేకుండా ఏడుపురాదు" అని మరికొంత సేపు ఏవో కబుర్లు చెప్పి మేడదిగి నెమ్మదిగా వీథిలోకి జారుకున్నాడు చంద్రం.

నడుస్తుంటే అతనికి తండ్రి గుర్తురాలేదు. ఏదో కొత్తగా వుంది కాని అలా నడుస్తూ తెలియకుండానే కుటుంబరావు గారిల్లు చేరాడు.

కుటుంబరావు గారు ఒక ప్రభుత్వశాఖలో వీరభద్రానికి సీనియర్‌గా పనిచేసి ఈమధ్యే రిటైరయ్యాడు. అంతకుముందే వీరభద్రం ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి కాంట్రాక్టులు మొదలెట్టాడు. అయినా, రెండు కుటుంబాలకీ స్నేహం వుండిపోయింది. ఆయన భార్య మాణిక్యాంబ అంటే చంద్రానికి చాలా అభిమానం. ఆవిణ్ణి 'అమ్మగారూ' అని పిలుస్తాడు. అతను తన తల్లిని అమ్మా అని పిలవడం ఏనాడో మానేశాడు.

చంద్రాన్ని చూడగానే కుటుంబరావుగారు చదువుతున్న పేపరు పక్కకు పెట్టి కుర్చీ లోంచి లేచి "సాదరంగా" ఆహ్వానించాడు. కూర్చోమని ఏవేవో సానుభూతి వాక్యాలు పలికాడు, మధ్యలో పెళ్ళాన్ని కేకపెట్టి.

మాణిక్యాంబ చంద్రాన్ని కావిలించుకుని ఏడుపు మొదలుపెట్టింది, "మాకు ...మా కళ్ళముందు పెరిగిన మీ నాన్నకి నూరేళ్ళూ ...జరగకూడనిది జరిగిపోయిందిరా చందూ" అంటూ. చంద్రానికి ఏడుపు రాలేదు. "అమ్మగార్రూ పెద్దలు మీరే అధైర్యపడితే ఎలా? హార్ట్ ఎటాక్ కదా, బాధలేకుండా వెళ్ళిపోయాడు-మాఫాదరు" అని ఊరడించాడు ముసలావిడని.

చంద్రానికి తన బాల్యం గురించిన ఏ జ్ఞాపకాలూ ఎందుకు లేవో తెలీక తెలుసుకోవాలని తపనవుండేది. అందుకే ఫ్రాయిడ్, వివేకానంద, సార్త్రే మొదలైనవాళ్ల బోధలూ డికెన్స్ నుంచి హెరాల్డ్ రాబిన్స్ వరకూ నవలలు చదువుతూ వచ్చాడు. అందుకే మాణిక్యాంబ ఎంత ఏడిచినా ఏవేవో పెద్ద కబుర్లు చెప్పాడు. చెబుతూనే తనది రాతిగుండె ఏమో, తనకి ప్రేమ రాహిత్యం జబ్బేమో అనుకున్నాడు.

మాణిక్యాంబ వీరభద్రం గురించి అవీ ఇవీ చెప్తూ మధ్యమధ్య ఏడుస్తుంటే ప్రేమగా కసిరాడు రావుగారు. "కుర్రకుంక అసలే కుంగిపోయి వున్నాడు. అవన్నీ గుర్తుచేస్తావెందుకు. చూడు ఎంత నీరసంగా కనిపిస్తున్నాడో హాస్టల్ తిండి-" అంటూ మాట మళ్ళించాడు.

"ఒరే చంద్రం, నువ్వు చిన్నప్పట్నించీ బుద్ధిమంతుడివే కాని మీతమ్ముడు గడుగ్గాయిరా! ఎంత అల్లరి వెధవో! ఓసారి మీ నాన్న నలుగురు బిజినెస్ ఫ్రెండ్స్‌కి ఇంజనీర్లకి పెద్ద విందు ఏర్పాటుచేశాడు, మూడుస్వీట్లూ, మూడుహాట్లూ; బాదంఖీర్. అయిస్ క్రీం....ఏపిల్సూ

....ఒకటేమిటి- నన్ను పిలవలేదులే, ఏ అయిటమ్స్ ఉండాలో నాతో డిస్కస్ చేశాడు. అలా తెలిసింది - అందరూ వచ్చి తీరా వడ్డించేవేళకి ఏమైందనుకున్నావ్‌? అన్ని స్వీట్లు పళ్ళూ ప్రతీదీ కాస్త కాస్త ముక్కపోయి ఉంది. మీ తమ్ముడు అన్నీ కొరికికొంచెం కొంచెం తిన్నాడన్న మాట. కుర్రవెధవకి అన్ని తిను బండారాల్ని ఒక్కసారి చూసేసరికి దుర్గ పుట్టిందన్నమాట. అన్నీ తినలేం కదా అని కొంచెం కొంచెం ఎంగిలి చేశాడన్నమాట. నాలుగేళ్ళవెధవ-ఏం తెలుస్తుంది అంతకంటె? ఆ రోజున మీనాన్న వీరభద్రావతారం ఎత్తేడనుకో. నిన్నూ నీ తమ్ముణ్ణీ స్పృహ తప్పిపోయేలా కొట్టాడు!" అని అదో జోక్ అన్నట్లు నవ్వాడు రావుగారు.

ఆ సంఘటన చాలా లీలగా గుర్తొచ్చింది చంద్రానికి. అంత దారుణమైన విషయం తనెందుకు మరిచిపోయాడో అర్థమై అతని మనస్సు అవమానంతో గిజగిజలాడింది. అందుకే అతనికి తన చిన్నతనం ఏమీ గుర్తురాదు. తనకి అసలు బాల్యం అనేది లేదేమోనన్నంత పూర్తి విస్మృతి.

అంతలో వంటిట్లోకి వెళ్ళి అరిసెలూ, పెరుగు వడలూ నిండిన కంచంతో తిరిగి వచ్చిన మాణిక్యాంబ కంచాన్ని చంద్రం ఒడిలో పెట్టింది. చంద్రం వద్దంటే "తిను బాబూ, నాకు కొడుకులు లేరనే లోటు లేదురా నీ మూలంగా. జ్ఞాపకం వచ్చాక నువ్వు మీ అమ్మని ఏమైనా తిండి పెట్టమని అడగడం మానేశావు. నన్ను మాత్రం సతాయించి ఏమీ లేకపోతే వండించుకుని తినేవాడివి. తినునాన్నా. ఎంత బక్కగా వున్నావో!" అంది గద్గద స్వరంతో. వెంటనే తినసాగాడు చంద్రం.

రావుగారు చంద్రాన్ని ప్రేమగా చూస్తూ 'మీ నాన్నది భలేపట్టుదలోయ్, ఉద్యోగం రిజైన్ చేసి బిజినెస్‌లోకి దిగుతానంటే పెట్టుబడి ఎలాగో అన్నానేనను. ఖచ్చితంగా చెప్పాడు పొదుపు చేస్తానని. 'ఇకనించి పదేళ్ళదాకా కూరలు తెమ్మని అడక్కే భామా' అని మీ అమ్మతో చెప్పేశాడుట. కడుపు కట్టుకుని లక్షలు ఆర్జించాడు, అనుభవించే టైంకి ఆయుష్షేలేకపోయింది !"

"మీరు మరీని. సుశీలసాయం లేకపోతే భద్రం అంతవాడయ్యేవాడా? కూరలేకాదు. టిఫెన్లులేవు, చిరుతిళ్ళులేవు! పాల వాడకం తగ్గించేసింది. పిల్లలకి కూడా రెండు పూట్లా అన్నమే. అంత పతివ్రత కనుకనే ఇంతసిరి అబ్బిందివాళ్ళకి" అంది మాణిక్యాంబ.

అలా మాటలు సాగాయి. చంద్రానికి కాఫీ ఇచ్చింది మాణిక్యాంబ. తరువాత ఇంట్లోకెళ్ళి పెట్లో దాచిన ఫోటో ఆల్బం తెచ్చి తిరగేస్తూ చంద్రం బాల్యం గురించి చెప్పసాగింది. ఆవిడకి చంద్రమే కొడుకుగా లెక్క కనుక అతని ఫొటోలు చాలా సంపాదించి దాచింది.

లేటెస్ట్ ఫొటో రెండేళ్ళక్రితం చంద్రానికి ఎం.బి.బి.ఎస్ లో సీటొచ్చినప్పుడు అతనూ తండ్రీ దిగినది. అంతదాకా పెట్టుబడి చాలకా. పేమెంట్లు టైంకి జరగకా లక్షలకాంట్రాక్టులు చేస్తున్నా సెక్యూరిటీ స్థిరత్వం ఎరుగడు వీరభద్రం. అందుకే ఆ ఫొటోలో అతనిముఖం నిండుసభలో వేదికమీద ఎవరో సాచిలెంపకాయకొడితే బిత్తరపోయి చూస్తున్న సన్మానాల కవి ముఖంలా వుంది. కన్ఫ్యూజన్ ముట్టడినించి ఏంగ్జయిటీ గుప్పిటనించి స్వర్గారోహణ సమయంలో స్విచ్చి ఆర్పేస్తారన్న భయంనించి తేరుకోని మనిషి మొహం అది. దాన్ని చూడగానే కత్తిపోటులాంటి జాలి తాకిడి తగిలింది చంద్రానికి. చిన్న పిల్లలకి జాలి ఉండదు.

ఆ తరవాత తన పసితనపు ఫొటోల్ని చూసి ఆశ్చర్యపోయాడు చంద్రం. తన కెంతో గారం జరిగేది. కర్రగుర్రం. పెద్దపెద్ద బొమ్మలూ, లేటెస్ట్ ఫాషన్ (దిపమొలతో సహా) దుస్తులు-ఓ రాయల్ బేబీ! అమాయకపు ఆనందంతో థ్రిల్ తో బిగ్గరగా నవ్వాడు. పక్కనించి తనూ చూస్తున్న మాణిక్యాంబ బూరెబుగ్గలేసుకుని దొరబాబులా వుండేవాడివిరా. బళ్ళోచేరాక అదేం గ్రహచారమో, బక్కలా అయిపోయావు" అంది.

చంద్రాన్ని బళ్ళో వేసినప్పుడు ఎంతో పెద్దపండుగలా చేశాడు వీరభద్రం. అంత చిన్న ఉద్యోగీ తాహతుకి మించిన ఖర్చు చేశాడు. ఆ ఫొటోలో చంద్రం దొరబాబు లాగే వున్నాడు. బూరెబుగ్గలూ, ఠీవితో మెరిసేకళ్ళూ, చిరునవ్వుతో సొట్టలుపడిన బుగ్గలూ....తరువాత ఆల్బం ఎంత తిరగేసినా ఇంక ఫోటోలు లేవు ఎం.బి.బి.ఎస్‌లో చేరేముందు తీసిన ఫొటోలో అతని పీక్కుపోయిన మొహం, అలిసిపోయిన కళ్ళూ తప్ప. అప్పుడు అతనికి పదిహేడేళ్ళు.

రెండు ఫొటోలకీ మధ్యనున్న పన్నెండు సంవత్సరాల తన బాల్యం ఏమైంది- అనుకునేసరికి చంద్రం గుండెల్లో "డామ్" పగిలినట్లు దుఃఖం వచ్చి ఏడవసాగాడు.

(ఆంధ్రజ్యోతి; వీక్లీ 2-12-1979)

★